క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను నిర్వహించింది. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు దేవస్థానం అధికారులు, అర్చకులు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

అధిక దిగుబడులు సాధించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని సంజీవ్‌నగర్ తండా పరిధిలో సాగైన వరి పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. చీడపీడల ఉధృతిని తెలుసుకుని, ఎకరాకు 5-10 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ మందును ఎకరాకు 120 గ్రాములు లేదా కాసుగమైసిన్ మందును ఎకరాకు 400-600 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలన్నారు.

ట్యాంకర్ బోల్తా.. ఒకరికి గాయాలు



బోల్తా పడిన సున్నం ట్యాంకర్

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సున్నం ట్యాంకర్ బోల్తా పడిన ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. విజయవాడ నుంచి సున్నం లోడుతో బళ్లారికి వెళ్తున్న ట్యాంకర్ గురువారం తెల్లవారు జామున కేజీ రోడ్డుపై ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. ప్రమాదంలో ట్యాంక్‌లో ఉన్న యర్రగుడూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు వెలుగోడు విద్యార్థిని



ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినితో హెచ్‌ఎం సత్యనారాయణ

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి తెలుగు శిరీష 34వ జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని గురువారం హెచ్‌ఎం సత్యనారాయణ, పీడీ సురేషనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 28 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగనున్న ఖోఖో పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టులో శిరీష స్థానం సంపాదించడం ఆనందంగా ఉందన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

మిడుతూరు: గర్భిణులు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని నందికొట్కూరు సీడీపీఓ కోటేశ్వరమ్మ సూచించారు. గురువారం స్థానిక మండల సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార మాసోత్సవాల్లో సీడీపీఓ మాట్లాడుతూ గింజ ధాన్యాలు, పప్పుదినుసులు, పాలు, మాంసాహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, నూనె, చక్కెర పదార్థాలను సమపాళ్లలో తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. పోషకాహార లోపంతో కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఎంఈఓ -2 శ్రీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్‌గా హైకోర్టు న్యాయవాది



రాజేశ్వరరావు

మహానంది: వ్యవసాయ మార్కెటింగ్ కమిటీస్ స్టాండింగ్ కౌన్సిల్‌గా మహానందికి చెందిన హైకోర్టు న్యాయవాది గంగిశెట్టి రాజేశ్వరరావును నియమిస్తూ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ ప్రభుత్వ సెక్రటరీ వి.సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పదవి లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛతా.. నువ్వెక్కడ?



ఈర్నపాడు గ్రామంలో అధ్వానంగా ఉన్న వీధి రోడ్లు



అధికారులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా గ్రామాలు మాత్రం మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యం పడకేసి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. నెలల తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నిండి మురుగు రోడ్లపై చేరి మడుగులను తలపిస్తున్నాయి. మరి ఏ గ్రామం స్వచ్ఛంగా ఉందో అధికారులకే తెలియాలి.

బండిఆత్మకూరు: గ్రామాలు స్వచ్ఛంగా రూపుదిద్దుకోవాలంటే మెరుగైన పారిశుద్ధ నిర్వహణ ప్రధాన మార్గం అనే మహాత్మా గాంధీ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం కేవలం అధికారుల ఆర్భాటాలకు, ప్రచారాలకే పరిమితమైంది. బండిఆత్మకూరు మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి వద్ద పరిసరాల అపరిశుభ్రతే ఇందుకు నిదర్శనం. ఈర్నపాడు గ్రామంలోనూ పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీ నిండి రోడ్లపై మడుగును తలపిస్తోంది. అలాగే పలు గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. వారు హంగు ఆర్భాటాలు ఫొటోలకు ఫోజులివ్వడం తప్ప పారిశుధ్య పనులు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలోని గ్రామాల్లో చెత్తాచెదారం తొలగింపు, మురుగు కాలువల శుభ్రత పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



బండిఆత్మకూరు పశువుల ఆసుపత్రి వద్ద చెత్తకుప్పను తలపిస్తున్న పరిసరాలు

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

కొత్తపల్లి: పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చిన నిండు గర్భిణికి ప్రసవం చేయకుండా నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకుడు, ఏ.రాజశేఖర్, మండల కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని చెంచుగూడెంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వీరన్నతో కలిసి వారు పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈనెల 21న భ్రమరాంబ చెంచుగూడేనికి చెందిన గర్భిణి ఈరమ్మ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రసవం కోసం వెళ్తే అక్కడి వైద్య సిబ్బంది డెలివరీ చేయకుండా ఆత్మకూరుకు పొమ్మనడంతో ఆస్పత్రి మెట్ల వద్దే డెలివరీ అయిన విషయాన్ని తెలుసుకున్నారు. గిరిజనుల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని ఇలాంటి వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఈ విషయంపై వైద్యురాలు దీపా నాగవేణిని వివరణ కోరగా ఆ రోజు డాక్టర్ల సమ్మెలో ఉన్నామని, స్టాఫ్‌నర్స్ మరో గర్భిణికి ప్రసవం చేస్తుండటం, గిరిజన మహిళ హెచ్‌బీ ఏబీ పాజిటివ్ కేసు కావడంతో హై రిస్క్ కేసుగా భావించి ఆత్మకూరు సీహెచ్‌సీకి రెఫర్ చేసినట్లు తెలిపారు. అంతలోనే ప్రసవం కావడంతో లోపలకు తీసుకు వెళ్లి వైద్యం అందించినట్లు వివరించారు.

ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

జూపాడుబంగ్లా: వీర వనిత చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని రజక సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు బస్తిపాటి మౌలాలి సూచించారు. ఐలమ్మ జయంతిని మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బస్తిపాటి మౌలాలి, సీపీఐ నాయకుడు రమేష్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు ఎర్రన్న తదితరులు మాట్లాడుతూ భూమి, భుక్తి కోసం రజాకార్లపై పోరాటం చేసి పేదలకు భూమిని పంపిణీ చేసిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. అనంతరం మండల తాత్కాలిక కమిటీ చైర్మన్‌గా రామాంజనేయులు, కన్వీనర్‌గా నాగభూసణం, మెంబర్లుగా బండ్ల రవికుమార్, 108 శ్రీనివాసులు, గొరిన మధులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలయ్య, చెంచు సంఘం నాయకుడు పుల్లయ్య, నంద్యాల రజక సంఘం కన్వీనర్ వెంకటేశ్వర్లు, పాములపాడు రజక సంఘం అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న రజకులు

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుర్ధులకు గురువారం సున్నిపెంటలోని బయో డైవర్సిటీ లాబోరేటరీలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, సైన్స్ విద్యార్థుర్దులు ఎకోలాజికల్ పార్క్‌లో కలుపు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం బయోడైవర్సిటీ లాబోరేటరీలో అసిస్టెంట్ కన్జర్వేటర్ ధనరాజ్, ల్యాబ్ సైంటిస్ట్ ఎం.రమేష్, ఎఫ్‌ఎస్‌ఓ నాగూనాయక్, అధ్యాపకులు డాక్టర్.వి.అబూబకర్, ఎం.రాజు పర్యావరణంపై విద్యార్థులకు పలు అంశాలు తెలియజేశారు.

పీఎఫ్‌ను కార్మికుల ఖాతాలో జమ చేయాలి

ఆత్మకూరు: స్థానిక మున్సిపాలిటీలో 2016 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం మున్సిపల్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పట్టణ ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు సంభవించకుండా పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు రాజేంద్ర, నాగప్రసాద్, రమేష్, స్వాములు, నాగన్న, విజయ్‌కుమార్, సురేష్, సువర్ణమ్మ, దేవమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

పంట నష్టపరిహారం మంజూరు

పాములపాడు: భారీ వర్షాల వల్ల మండలంలో నష్టపోయిన 1,807 మంది రైతులకు పరిహారం మంజూరైందని ఏఓ ఫణీశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పంటలు దెబ్బతిన్న బానుముక్కల, ఇస్కాల, కంబాలపల్లి, చెలిమిల్ల, లింగాల, యర్రగూడూరు, పాములపాడు, వేంపెంట గ్రామాల రైతులకు పరిహారం మంజూరైందన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన ఇరువర్గాలపై పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. గురువారం ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఒక వర్గానికి చెందిన వ్యక్తిపై మరొక వర్గానికి చెందిన వ్యక్తి దాడికి పాల్పడటంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో యిడమకంటి విష్ణువర్ధన్ రెడ్డి, మురళీధర రెడ్డి, మహానంది మహేశ్వరరెడ్డి, రంజిత్‌కుమార్ రెడ్డి, మదనగోపాల్, శివకృష్ణ, వెంకటనాయుడు, శ్రీనివాసులు, వెంకటరామనాయుడు, బలరాముడులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులను భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్. పి.హుస్సేన్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పీజీలో 55 శాతం మార్కులు, NET,ET,Phd అర్హతలు ఉండి గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు అక్టోబర్ 5న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలన్నారు.

దామగట్ల ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

నందికొట్కూరు: మండల పరిధిలోని దామగట్ల గ్రామ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ వేల్పుల మునిస్వామి(40) అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికి భార్య జయమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

హెచ్‌ఎంల సమావేశం

ఆత్మకూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ-1 బాలాజీనాయక్, ఎంఈఓ-2 సురేష్ హాజరై మాట్లాడారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. యూడైస్ ప్లస్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర-2047పై ఎస్‌ఏ, డిబేట్ పోటీలను కాంప్లెక్స్ స్థాయిలో గెలిచిన వారికి మండలస్థాయి పోటీలకు పంపాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం స్వాధీనం

పాములపాడు: అక్రమంగా తీసుకెళ్తున్న 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. గురువారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మండలంలోని క్రిష్ణానగర్ గ్రామానికి చెందిన విజేయుడు మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు చెప్పారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

టెండర్లకు స్పందన కరువు

మహానంది: స్థానిక దేవస్థానంలో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలకు అవసరమైన పూలు, పూల మాలల సరఫరాతోపాటు విద్యుత్ అలంకరణ ఏర్పాటుకు టెండర్లు నిర్వహించగా స్పందన కరువైంది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సీల్డు టెండర్లు నిర్వహించారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో టెండరు దారులు పెద్దగా హాజరు కాలేదు. వచ్చిన కొందరు కూడా దేవస్థానం చెల్లించే ధరలు గిట్టుబాటు కాకపోవడంతో వెనుదిరిగారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

నందికొట్కూరు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత సూచించారు. గురువారం కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మాకే నామ్ పేడ్ నినాదంతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అధ్యాపకులు ఖాజా హుసేన్, పరిమళాదేవి, రఘుపతిరెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా బస్తాలు సీజ్

శిరివెళ్ల: యర్రగుంట్లలో గురువారం ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. శ్రీశ్రీ ఏజెన్సీస్ ఎరువుల దుకాణంలో ఎమ్మార్పీ కన్నా ఎరువులను అధిక ధరలో అమ్ముతున్నారని రైతుల ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అధికారి రూపస్ రోనాల్డ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపారు. ఈ దాడుల్లో దుకాణ గోడౌన్‌లోని రూ.1.43 లక్షల విలువ చేసే 540 యూరియా బస్తాలను సీజ్ చేశారు. అలాగే మరో దుకాణంలో ఈ- పాస్, గోడౌన్‌లోని ఎరువుల నిల్వలలో వ్యత్యాసం రావడంతో రూ.9.98 లక్షల విలువ చేసే ఎరువులను నాట్ సేల్ కింద ప్రకటించారు. దాడుల్లో ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

లొంగిపోయిన హత్య కేసు నిందితుడు

మహానంది: సీతారామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి సుబ్బరాయుడు హత్య కేసులో ఏ-8 నిందితుడు గాజ రామసుబ్బయ్య గురువారం లొంగిపోయినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. నిందితుడిని నంద్యాల జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారన్నారు. కాగా సుబ్బరాయుడి హత్య కేసులో ఇప్పటి వరకు 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

పగిడ్యాల: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టి పారిశుధ్య పనులు చేపట్టారు. ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్యల ఆధ్వర్యంలో కస్తూర్బా బాలికల విద్యాలయం, కుంటవీధి ప్రధాన కాలువ వెంట పేరుకుపోయిన చెత్తచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి ఉష, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు.



కేజీబీవీ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న అధికారులు

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

నందికొట్కూరు: జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి ధర్నా చేపట్టారు. ప్రభుత్వం వెంటనే మౌలిక వసతులు కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు తాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం.. మంచి ప్రభుత్వంగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. నెల రోజుల నుంచి కుళాయిలకు తాగునీరు సరఫరా కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజాప్రతినిధులకు, మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటితో పాటు రహదారులు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి



అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక అధికారి చింతామణి

కొత్తపల్లి: గృహనిర్మాణాలను పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి, సోషల్‌వెల్ఫేర్ డీడీ చింతామణి అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 235 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయన్నారు. శివపురం, గోకవరం, కొత్తపల్లి గ్రామాల మొదటి లేఅవుట్‌లో 107 మంది లబ్ధిదారులు గృహాలను నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. అందులో కొంతమంది ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించారన్నారు. ఈనెల 28న లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేసుకుని అవగాహన కల్పించాలని సూచించారు. 2025 మార్చిలోపు నిర్మాణాలు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ మేరి, ఏపీఓ రేష్మ, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ పాండునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆత్మకూరు: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, మండల కార్యదర్శి వీరన్న, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, పండ్లతోటల సంఘం అధ్యక్షులు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు ధర్నా చేపట్టి తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయంగా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని వాగ్దానం చేసిన కూటమి నేతలు అధికారం చేపట్టి వంద రోజులవుతున్నా మాటను నిలబెట్టుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు పాల శివుడు, అంబయ్య, రామసుబ్బయ్య, నాగన్న, దర్గయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసింహానాయక్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సర్వీసు రోడ్లు నిర్మించాలి

జూపాడుబంగ్లా: రైతులు పొలాలకు వెళ్లేలా నేషనల్ హైవే 340సీ వెంట సర్వీసు రోడ్లు నిర్మించాలని సీపీఐ నాయకులు రమేష్, నాయకులు పుల్లయ్య, చెంచన్న, బాషా డిమాండ్ చేశారు. రైతులతో కలిసి గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కోసం పొలాలు ఇస్తే రోడ్డు నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు రైతులు పొలాలకు వెళ్లకుండా డివైడర్లను ఏర్పాటు చేశారన్నారు. ఎద్దులబండ్లు, బైక్‌లు, ఆటోలు, ధాన్యం బండ్లు పొలాల వద్దకు వెళ్లలేకపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఫిర్యాదు చేయండి.. చర్యలు తీసుకుంటాం

- ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: నకిలీ విత్తనాలతో నష్టపోయామనే రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని ఏడీఏ ఆంజనేయ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రైతు వెంకటస్వామి సాగు చేసిన మొక్కజొన్న పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కావేరి (8333) రకం విత్తనం వేశానని, పైరు ఏపుగా పెరిగినా కంకులు రావడంలేదని ఏడీఏకి రైతు ఫిర్యాదు చేశాడు. కంపెనీపై రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వాలని రైతుకు ఆయన సూచించారు.



మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరల్ ఆర్గనైజేషన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ సంప్రదాయ నత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహాగణపతిం, మూషికవాహన, గణేశ పంచరత్నం, అదిగదిగో శ్రీశైలం, శివతాండవం, నమఃశివాయతే, అఖిలాండేశ్వరి, శివస్తుతి, దేవీస్తుతి తదితర గీతాలకు లాస్య, వాణిపద్మజ, పుష్పలత, కోమలి, సాయిసుధ, శివ, ఆశాజ్యోతి, పల్లవి, గౌతమి తదితరులు నృత్యాలు ప్రదర్శించారు.



నృత్య ప్రదర్శనలో కళాకారులు

బిల్లులు రావు... గదులు పూర్తి కావు



నిలిచిపోయిన అదనపు గదుల నిర్మాణం

జూపాడుబంగ్లా: బిల్లులు మంజూరు కాకపోవడంతో గురుకుల పాఠశాల అదనపు గదుల నిర్మాణం చివరి దశలో నిలిచిపోయింది. మూడేళ్ల క్రితం రూ.98 లక్షల నాబార్డు నిధులతో నాలుగు అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్లు నిర్మాణాలు వేగంగా చేపట్టారు. పనులు పూర్తికావొచ్చినా బిల్లులు మంజూరు చేయకపోవటంతో కాంట్రాక్టర్లు చివరిదశలో నిర్మాణాలు నిలిపేశారు. దీంతో చాలీచాలని గదుల్లోనే విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. పనులను పర్యవేక్షిస్తున్న సోషల్‌వెల్ఫేర్ డిపార్టుమెంట్ అధికారులు రూ.50 లక్షలకు బిల్లులు పెట్టినా మంజూరు కాకపోవటంతోనే తాము పనులు నిలిపివేశామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ మూర్తిని వివరణ కోరగా విషయాన్ని గురుకుల పాఠశాలల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.